# చరిత్ర గ్రంథాలు - పరిచయం

పంచకాండాల్లోని చివరి గ్రంథమైన ద్వితీయోపదేశకాండము ఇశ్రాయేలీయులు యొర్దాను నదికి తూర్పున మోయాబు మైదానంలో విడిది చేసినప్పుడు ముగుస్తుంది. దేవుడు వాగ్దానం చేసిన కనాను దేశంలోనికి ప్రవేశించడానికి ఇశ్రాయేలీయులు సిద్ధంగా వున్నారు. (ద్వితీ 1:1-8 ; 34:1-8). మోషే మరణం గురించి, మోషే అనంతరం ఇశ్రాయేలీయులను నడిపించిన యెహోషువ గురించి ద్వితీయోపదేశకాండము చివరి భాగం వివరిస్తుంది.

పాత నిబంధనలో పంచకాండాల తర్వాత యెహోషువ నుంచి ఎస్తేరు వరకున్న గ్రంథాలను చరిత్ర గ్రంథాలు అని పిలుస్తారు. కనానులో ఇశ్రాయేలీయుల చరిత్ర గురించి ఈ గ్రంథాలు వివరిస్తాయి. వీటిని చరిత్ర గ్రంథాలు అని పిలుస్తున్నప్పటికీ, వీటికీ ఆధునిక చరిత్ర గ్రంథాలకు చాల వ్యత్యాసాలున్నాయి. బైబిల్లోని చరిత్ర గ్రంథాల్లో చారిత్రక సంఘటనల వర్ణన దేవుని ఉపదేశాలను ఇశ్రాయేలీయులకు దేవునికి మధ్యవున్న ప్రత్యేకమైన సంబంధాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన వర్ణన గనుక ఈ చరిత్ర గంథ్రాలు చారిత్రక సంఘటనలతో బాటు ఆసక్తి కలిగించే కథనాలతో పాఠకులను ఆకట్టుకుంటాయి. రూతు ఎస్తేరు గ్రంథాలు చరిత్ర గ్రంథాల్లాగా కాక చక్కని కథాంశంతో ఒక నవలను పోలివుంటాయి.

ఈ గ్రంథాలన్నీ క్రీ.పూ. 1250 నుంచి క్రీ.పూ. 150 వరకున్న చరిత్రను తెలియజేస్తున్నాయి. ఈ సుదీర్ఘ చరిత్రలో అనేక ప్రధాన సంఘటనలు వున్నాయి; వేర్వేరు వ్యక్తులు తారసపడతారు.

చరిత్ర గ్రంథాల్లోని మొదటిది ముఖ్యమైనది అయిన సంఘటన ఇశ్రాయేలీయులు కనానులో స్థిరపడడం. ఇశ్రాయేలీయులు కనాను దేశాన్ని ఎలా స్వాధీనపరచుకొన్నారో అక్కడ వారెలా స్వాస్థ్యాలు పొందారో యెహోషువ న్యాయాధిపతులు గ్రంథాలు వివరిస్తాయి. దేశం కొంత కాలం నెమ&మదిగా (సమాధానం) వుంది. మరి కొన్ని సార్లు శత్రు భయం ఎదురైంది. ఇశ్రాయేలీయుల్లోని వివిధ గోత్రాల ప్రజలు న్యాయాధిపతుల పరిపాలనలో ఎలా జీవించారో ఈ రెండు గ్రంథాలు వివరిస్తాయి.

చరిత్ర గ్రంథాల్లోని రెండవ ప్రముఖ ఘట్టం : రాచరిక వ్యవస్థ. ఇశ్రాయేలీయుల మొట్టమొదటి రాజుగా దేవుడు సౌలను ఏర్పరచుకోవడాన్ని దావీదు ఇశ్రాయేలు మీద రాజైన సంఘటనలను 1,2 సమూయేలు గ్రంథాలు వివరిస్తున్నాయి. దావీదు యెరూషలేంను ముఖ్య పట్టణంగా చేయడం కూడా ఈ ఘట్టంలోనిదే.

దావీదు మరణానంతరం అతని కుమారుడైన సొలొమోను రాజయ్యాడు. సొలొమోను యెరూషలేంలో దేవాలయాన్ని కట్టించాడు. సొలొమోను కాలంలో నిర్మితమైన దేవాలయం మొట్ట మొదటి దేవాలయం. వైభవంలో ఐశ్వర్యంలో ఇశ్రాయేలుకు సాటి అయిన రాజ్యం లేదు. అయితే, భవన నిర్మాణ కార్యక్రమాల్లో ప్రజలను తక్కువ వేతనం మీద నియమించడం, యితర దేవతలను పూజించడం కారణంగా సొలొమోను మరణానంతరం ఇశ్రాయేలు రాజ్యంలో తిరుగు బాటు మొదలైంది. ఈ తిరుగుబాటు ఫలితంగా రాజ్యం రెండుగా వేరైపోవడం

చరిత్ర గ్రంథాల్లోని ముఖ్యమైన మూడవ సంఘటన. 1 రాజులు, 2రాజులు, 1 దినవృత్తాంతవ ములు, 2 దినవృత్తాంతములు గ్రంథాలు ఉత్తర దక్షిణ రాజ్యాలను పరిపాలించిన రాజుల గురించి వారి పరిపాలనల (క్రీ.పూ. 931-586) గురించి వివరిస్తాయి.

చరిత్ర గ్రంథాల్లోని నాల్గవ ప్రముఖ సంఘటన విభక్త రాజ్యాల ఓటమి, చెర, అమోసు హోషేయ ప్రవక్తలు హెచ్చరించినప్పటికీ ఉత్తర రాజ్య ప్రజలు (ఇశ్రాయేలు) విగ్రహాలను పూజించి దేవుని ధర్మశాస్త్రానికి అవిధేయులయ్యారు. ఫలితం - క్రీ.పూ. 722లో అష్షూరువారి చేతిలో పరాజయం చవి చూశారు. దావీదు వంశీయులు దక్షిణ రాజ్యాన్ని (యూదాను) పరి పాలించారు. దక్షిణరాజ్యం సైతం యెషయా యిర్మీయా యెహెజ్కేలు ప్రవక్తల సందేశాలను ఖాతరు చేయలేదు. ప్రజలు రాజులు సైతం యెహోవా పట్ల అవిధేయత చూపినందుకు, వీరిని యెహోవా బబులోనువారి చేతికి అప్పగించాడు. బబులోనువారు క్రీ.పూ. 586లో దండెత్తి యూదావారిని ఓడించి యూదా ప్రముఖులను బబులోనుకు బందీలుగీ తీసుకొని పోయారు.

క్రీ.పూ. 539లో పారసీకరాజైన కోరెషు బబులోనును ఓడించాడు. యూదులు తమ స్వదేశానికి వెళ్లిపోవచ్చని కోరెషు ఆజ్ఞ యిచ్చాడు. యూదులు చెర నుంచి స్వదేశానికి తిరిగి రావడం చరిత్ర గ్రంథాల్లో ఐదవ ప్రముఖ సంఘటన. ఎజ్రా నెహెమ్యా గ్రంథాలు యూదులు స్వదేశానికి తిరిగి రావడం గురించి, వారు యెరుషలేం ప్రాకారాలను దేవాలయాన్ని తిరిగి నిర్మించడం గురించి, దేవుని ప్రజగా తమను తాము మరలా ప్రతిష్ఠించుకోవడం గురించి వివరిస్తాయి.

## చరిత్ర గ్రంథాల్లోకన్పించే ప్రముఖ వ్యక్తులు

చరిత్ర గ్రంథాల్లో ప్రాముఖ్యంగా నలుగురు వ్యక్తులు కన్పిస్తారు. వారు :

యెహోషువ : మోషే మరణానంతరం ఇశ్రాయేలీయులను కనానుకు నడిపించి వారికి స్వాస్థ్యాలను పంచిపెట్టిన నాయకుడు.

సమూయేలు : ఇశ్రాయేలీయుల చిట్టచివరి న్యాయాధిపతి, ప్రజలు తమకు రాజు కావాలని సమూయేలు మీద ఒత్తిడి తెచ్చారు. అయితేవారిలా అడగడం దేవునిపట్ల వారి అపనమ్మకత్వానికి సూచన అని సమూయేలు హెచ్చరించాడు కూడ.

దావీదు : దావీదు ఇశ్రాయేలు రాజులందరిలో ప్రముఖుడు; ఘనుడు కూడ. చరిత్ర గ్రంథాల్లో కన్పించే సంఘటనలు దావీదు దేవునిపట్ల ఎంత యథార్థవంతుడో వివరిస్తాయి; దావీదు వంశంలోని వ్యక్తి ఇశ్రాయేలును ఎప్పటికీ పరిపాలిస్తాడని కూడా తెలియజేస్తాయి.

ఎజ్రా : ఇశ్రాయేలీయులు చెరనుంచి స్వదేశానికి తిరిగి రావడానికి, వారు యెహోవాను ఆరాధించి ఆయనకు విశ్వాస్యత చూపేలా ఎజ్రా వారికి సహాయం చేశాడు.